కెసిఆర్‌ను పరామర్శించిన డిప్యూటి సిఎం భట్టి, చంద్రబాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ అధ్యక్షుడు, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ వీలైనంత త్వరగా కోలుకొని ప్రజా సేవకు రావాలని టిడిపి అధినేత మాజీ సిఎం చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. సోమాజిగూడ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన్ను సోమవారం చంద్రబాబు పరామర్శించారు. కెసిఆర్ ఆరోగ్య పరిస్థితి గురించి అక్కడి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కెటిఆర్, ఇతర కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం ఆస్పత్రి వెలుపల చంద్రబాబు మాట్లాడుతూ.. కెసిఆర్ త్వరగా కోలుకుంటున్నారని చెప్పారు. కెసిఆర్‌తో మాట్లాడాలనిపించి వచ్చానని తెలిపారు. కోలుకోవడానికి ఆరువారాల సమయం పడుతుందని వైద్యులు చెప్పారన్నారు. త్వరలోనే కెసిఆర్ మామూలుగా నడుస్తారని చంద్రబాబు ఆకాంక్షించారు.యశోద ఆస్పత్రిలో ఉన్న కెసిఆర్‌ను సోమవారం పలువురు నేతలు పరామర్శించారు. తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క.. కెసిఆర్‌ను కలిసి మాట్లాడారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని గురించి వైద్యుల్ని అడిగి తెలుసుకున్నారు. శస్త్రచికిత్స విజయవంతమైందని వైద్యులు తనకు చెప్పినట్లు భట్టి వెల్లడించారు. ఆయన త్వరగా కోలుకుంటున్నారని అన్నారు. కేంద్ర మాజీ మంత్రి చిరంజీవి, సినీనటుడు ప్రకాశ్‌రాజ్, బిఎస్‌పి నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, పలువురు బిఆర్ఎస్ నేతలు కెసిఆర్‌ను పరామర్శించి, క్షేమ సమాచారం తెలుసుకున్నారు. కెటిఆర్‌తో ఫోన్‌లో మాట్లాడిన గవర్నర్ తమిళి సై కెసిఆర్ ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు.

14న స్పీకర్ ఎన్నిక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నూతన సభ కొలువుతీరిన నేపథ్యంలో స్పీకర్ ఎన్నిక ఈ నెల 14న జరగనుంది. బుధవారం సాయంత్రం ఐదు గంటల వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చు. స్పీకర్ ఎన్నికకు సంబంధించి నియమ నిబంధనలతో శాసనసభ కార్యదర్శి డా వి నర్సింహాచార్యులు సోమవారం నోటిఫికేషన్ విడుదల చేశారు.14న అసెంబ్లీ ప్రారంభమైన వెంటనే శాసనసభ కార్యదర్శి నర్సింహాచార్యులు స్పీకర్ ఎన్నిక ప్రక్రియ ప్రారంభిస్తారు. స్పీకర్ ఎన్నికకు దాఖలైన నామినేషన్లను సభ్యులకు చదివి వినిపిస్తారు. అయితే, అధికార పక్షం కాంగ్రెస్ ఇప్పటికే స్పీకర్ అభ్యర్థిగా సీనియర్ సభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ పేరు ప్రకటించిన నేపథ్యంలో స్పీకర్‌గా ఆయన ఎన్నిక లాంఛనంకానుంది. ఈ నెల 15న ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ప్రసంగించనున్నారు.

క్లాట్ ఫలితాల్లో శ్రీచైతన్య ఐఎఎస్ అకాడమి హవా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశవ్యాప్తంగా నేషనల్ లా విశ్వవిద్యాలయాల్లో ఐదేండ్ల లా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన క్లాట్-2024 ఫలితాల్లో శ్రీచైతన్య ఐఎఎస్ అకాడమి విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఈ మేరకు శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్, ఇన్ఫినిటీ లెర్న్ కో ఫౌండర్ సుష్మ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వివిధ కేటగిరీల్లో అత్యధికంగా రాష్ట్రస్థాయి, అఖిల భారత స్థాయి ర్యాంకులు సాధించారని తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో కె వినోత్న మొదటి ర్యాంకు, ఎన్ సాయి రాహుల్ మూడో ర్యాంకు, షేక్ మహమ్మద్ ఆసిఫ్ ఐదో ర్యాంకు, ఎ హర్షవర్ధన సాయి పదో ర్యాంకు, కె స్వరూప్ 11వ ర్యాంకు, డి హర్ష 14వ ర్యాంకు, జి నేహ 18వ ర్యాంకు, ఎం రోహిత్ 25వ ర్యాంకు, బి హేమలత 30వ ర్యాంకు, బి అభిలాష్ 41వ ర్యాంకు సాధించారని పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో వివిధ కేటగిరీల్లో 85, 123,470,482, 547, 864 ర్యాంకులు పొందారని వివరించారు.

సభలో మాట్లాడుతున్న బసవపున్నయ్య

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి

- ప్రభుత్వానికి హెచ్‌యుజె విజ్ఞప్తి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్(హెచ్‌యూజే) కార్యవర్గం విజ్ఞప్తి చేసింది. సోమవారం హైదరాబాద్‌లోని చిక్కడపల్లిలో గల త్యాగరాయ గాన సభలో హెచ్‌యూజే కార్యవర్గ సమావేశం జరిగింది. ఇటీవల మరణించిన టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎర్రం నర్సింగ్‌రావుకు రెండు నిమిషాల పాటు మౌనం పాటించి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌యూజే అధ్యక్షులు అరుణ్‌కుమార్, కార్యదర్శి బి.జగదీశ్, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య, రాష్ట్ర కార్యదర్శులు చంద్రశేఖర్, విజయానంద్, హెచ్‌యూజే నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బసవపున్నయ్య, అరుణ్‌కుమార్, జగదీశ్ మాట్లాడుతూ...సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల ఇండ్లు, ఇండ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రైతు, నేతన్న బీమాల మాదిరిగానే జర్నలిస్టుల బీమా పథకాన్ని తేవాలని కోరారు. టీవీలు, పత్రికలకిచ్చే యాడ్స్ నిధుల నుంచి జర్నలిస్టుల సంక్షేమం కోసం ఒకటి నుంచి రెండు శాతం జమచేయాలని విన్నవించారు. చాలా ఆస్పత్రుల్లో హెల్త్ కార్డులు పనిచేయడం లేదనీ, దీంతో వైద్యం విషయంలో జర్నలిస్టులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. ఉద్యోగుల తరహాలోనే జర్నలిస్టులకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. జర్నలిస్టుల సంక్షేమం పట్ల ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

తక్షణమే రైతుబంధు నిధుల విడుదల

- సిఎం రేవంత్ ఆదేశాలు
- రూ.2 లక్షల రుణమాఫీపై కార్యాచరణ ప్రణాళిక
- ప్రజా దర్బార్.. ఇక నుంచి ప్రజావాణి...
- వారానికి రెండు రోజులు నిర్వహణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని రైతులందరికీ రైతు బంధు నిధులను అన్నదాతల ఖాతాల్లో జమ చేసే ప్రక్రియను తక్షణమే (సోమవారం సాయంత్రం నుంచే) ప్రారంభించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఏ ఒక్క రైతుకూ ఇబ్బంది కలగకుండా పంట పెట్టుబడి సాయాన్ని అందించాలని ఆయన సూచించారు. అన్నదాతలకు రూ.2 లక్షల రుణ మాఫీపై కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ లోని సచివాలయంలో వ్యవసాయ శాఖపై సిఎం ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. దాదాపు మూడు గంటలపాటు నిర్వహించిన ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ, సంబంధిత విభాగాల పనితీరు, రైతు సంక్షేమ కార్యక్రమాల అమలుపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ... తమ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలోని రైతులకు రెండు లక్షల మేరకు రుణ మాఫీ చేసేందుకు తగు కార్యాచరణ ప్రణాళికను రూపొందించా లని ఆదేశించారు.

ప్రస్తుతం హైదరాబాద్ బేగంపేటలోని జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో నిర్వహిస్తున్న ప్రజా దర్బార్‌ను ఇకనుండి 'ప్రజావాణి'గా పిలవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని ఇక నుంచి ప్రతీ మంగళ, శుక్ర వారాల్లో రెండు రోజులపాటు ఉదయం 10 గంటలనుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తామని ప్రకటించారు. ఉదయం 10 గంటలలోపు ప్రజాభవన్‌కు చేరుకున్న వారికి ప్రజావాణిలో అవకాశం కల్పించాలని సూచించారు. వికలాంగులు, మహిళలకు ప్రత్యేక క్యూ-లైన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజల సౌకర్యార్థం తాగునీరు, ఇతర సౌకర్యాలను కల్పించాలని ఆదేశించారు. సమీక్షా సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంవో కార్యదర్శి శేషాద్రి, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ చెలామణిపై ఉక్కుపాదం

రాష్ట్రంలో మాదక ద్రవ్యాల చెలామణి, వినియోగంపై ఉక్కుపాదం మోపాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. నార్కోటిక్స్ కంట్రోల్ అంశంపై మంగళవారం సచివాలయంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ... రాష్ట్రంలో మాదక ద్రవ్యాలను వినియోగించినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర యాంటీ నార్కోటిక్ బ్యూరోకు పూర్తి స్థాయి డైరెక్టర్‌ను నియమించడంతోపాటు ఆ విభాగాన్ని బలోపేతం చేయాలని సూచించారు. అందుకు కావాల్సిన నిధులు, వనరులు, ఇతర సౌకర్యాలను సమకూర్చాలని ఆదేశించా రు. మాదక ద్రవ్యాల విక్రయం, చెలామణి నిరోధానికి అత్యంత ప్రాధాన్యత నివ్వాలని సూచించారు. గ్రే హౌండ్స్, ఆక్టోపస్ మాదిరిగా టీ.ఎస్.నాబ్‌ను తీర్చిదిద్దాలని అన్నారు. సమీక్షా సమావేశంలో ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డిజిపి రవి గుప్తా, ఇంటిలిజెన్స్ విభాగం అదనపు డిజి శివధర్‌రెడ్డి, సిఎంఒ కార్యదర్శి శేషాద్రితోపాటు పోలీస్, ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ, ఔషధ నియంత్రణ మండలి అధికారులు పాల్గొన్నారు.

ఫ్రీ బస్ సౌకర్యం ఎలా ఉంది?

- మహిళలతో సజ్జనార్ మాటా ముచ్చట
- జూబ్లీ బస్టాండ్‌లో ఆకస్మిక పర్యటన

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'మహాలక్ష్మి' ఉచిత బస్సు ప్రయాణం ఎలా ఉందని టిఎస్ఆర్‌టిసి మేనేజింగ్ డైరెక్టర్ విసి సజ్జనార్ మహిళలను అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ కాల్‌సెంటర్లకు ఫోన్ చేసి చెప్పాలని వారికి సూచించారు. సోమవారంనాడాయన సికింద్రాబాద్ లోని జూబ్లీ బస్‌స్టేషన్ (జేబీఎస్) లో ఆకస్మికంగా పర్యటించా రు. అక్కడి బస్సులు ఎక్కి మహిళా ప్రయాణీకులతో మాట్లాడారు. ఉచిత బస్సు ప్రయాణంపై వారి అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా బస్సుల్లోని మహిళలతో ముచ్చటించారు. తమ ప్రాంతానికి మరిన్ని బస్సుల్ని ఏర్పాటు చేయాలని పలువురు మహిళలు ఎమ్‌డీని కోరారు. వారి విజ్ఞప్తులను పరిశీలిస్తానని ఆయన హామీ ఇచ్చారు. జేబీఎస్-ప్రజ్ఞాపూర్, జేబీఎస్-జనగామకు వెళ్లే పల్లె వెలుగు, బాన్సువాడకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ బస్సుల్లోని మహిళా ప్రయాణికులతో మాట్లాడారు. అక్కడి నుంచి జేబీఎస్-వెంకట్‌రెడ్డి నగర్ (రూట్ నంబర్ 18 వీ/జే) సిటీ ఆర్డినరీ బస్సులో మెట్టుగూడ వరకు ప్రయాణించారు. ఆ బస్సులో ప్రయాణిస్తున్న విద్యార్థినులతో మాట్లాడారు. కండక్టర్‌తో కలిసి వారికి జీరో టికెట్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన 'మహాలక్ష్మి-మహిళలకు ఉచిత బస్ ప్రయాణం'కు మంచి స్పందన వస్తుందన్నారు. మహిళల ప్రయాణ ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ఈ పథకాన్ని అమల్లోకి తెచ్చారనీ, మహిళలు, బాలికలు, విద్యార్థినులు, ట్రాన్స్‌జెండర్లు ఈ సౌకర్యం ఉపయోగించుకోవాలని సూచించారు. ఇలాంటి ఓ గొప్ప కార్యక్రమంలో టిఎస్ఆర్‌టిసిని భాగస్వామిగా చేసినందుకు ఆయన ప్రభుత్వానికీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. చిన్న చిన్న లోటుపాట్లు ఉంటే వాటి ని సవరించుకుంటూ ఈ పథకాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. 'మహాలక్ష్మి'పై ఇప్పటికే సంస్థలోని 40 వేల మంది సిబ్బందికి అవగాహన కల్పించ ామన్నారు. మహిళలందరూ స్థానికతను నిర్ధారించుకునేందు కు తమ ఆధార్ కార్డులను సిబ్బందికి చూపించి ఆర్‌టిసికి సహకరించాలని కోరారు. ఉచిత ప్రయాణ సౌకర్యం ప్రవేశ పెట్టగానే రద్దీ పెరిగిందనీ, అందుకు అనుగుణంగా బస్సులను నడిపేందుకు ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. రద్దీ సమయాల్లో ప్రయాణికు లు కొంత సమయనం పాటించి.. సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎండి వెంట సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (గ్రేటర్ హైదరాబాద్ జోన్) వెంకటేశ్వర్లు, రంగారెడ్డి, సికింద్రాబాద్ ఆర్ఎంలు శ్రీధర్, ఖుష్రోషా ఖాన్ తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- మంత్రి సీతక్కకు తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేలా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి డి.అనసూయ (సీతక్క) చొరవ తీసుకోవాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.సునీత, పి.జయలక్ష్మి కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లో మంత్రి సీతక్కకు వారు వినతిపత్రాన్ని అందజేశారు. అంగన్‌వాడీ ఉద్యోగుల పోరాటానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా కాంగ్రెస్ నేతలు మద్దతు తెలిపిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ విషయంలో కాంగ్రెస్ నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. గత ప్రభుత్వం అంగన్‌వాడీ లకు సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలకు వెంటనే ఉత్తర్వులను జారీ చేయాలని మంత్రిని కోరారు. అంగన్వాడీలను పర్మినెంట్ చేసి కనీస వేతనం 26 వేలు ఇవ్వడంతో పాటు పిఎఫ్, ఈఎస్ఐ, తదితర సౌకర్యాల ను కల్పించాలని విన్నవించారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ చెల్లించేలా చూడాలన్నారు. 24 రోజుల సమ్మెకాలపు వేతనాలను వెంటనే చెల్లించాలనీ, పెండింగ్ వేతనాలివ్వాలని డిమాండ్ చేశారు. రెండో పిఆర్‌సి వర్తింపజేయడంతో పాటు కనీసవేతనం నిర్ణయించాలని కోరారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు రూ. రెండు లక్షలు, హెల్పర్లకు లక్ష రూపాయలు, అర్హులకు పెన్షన్ సౌకర్యాన్ని కల్పించాలని విన్నవించా రు. ప్రమాదబీమా సౌకర్యం రూ. లక్షల ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. అంగన్వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలన్నారు. యాప్‌లన్నీ రద్దు చేసి ఒకటే ఉండేలా చూడాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులివ్వాలని కోరారు. అర్హులైనవారికి ప్రమోషన్లు ఇవ్వాలనీ, ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఐసిడిఎస్‌కు సంబంధం లేని పనులను చేయించొద్దని సూచించారు. మూడేండ్ల రేషన్‌షాపు ట్రాన్స్‌పోర్టు చార్జీలను విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ రాష్ట్ర కోశాధికారి పి.మంగ, ఉపాధ్యక్షులు డి.సునీత, సహాయ కార్యదర్శి బి.స్వప్న, జి.శారద, రాష్ట్ర నాయకులు పి.నాగమణి, కె.సమ్మక్క, నిర్మల, అన్నపూర్ణ, కె.నర్సమ్మ, బి.నారాయణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరికీ న్యాయం చేస్తాం

- మంత్రి శ్రీధర్‌బాబు
- ప్రజాదర్బార్‌లో 1,143 వినతులు స్వీకరించిన మంత్రి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తమ ప్రభుత్వం పారదర్శకంగా, జవాబుదారీతనంతో పనిచేస్తుందనీ, ప్రజలందరికీ న్యాయం చేస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు భరోసానిచ్చారు. ప్రజాదర్బార్‌లో ప్రజలిచ్చే వినతిపత్రాలపై పూర్తి అడ్రస్, సెల్‌ఫోన్‌నెంబర్, పూర్తి వివరాలు రాయాలని సూచించారు. సిఎం ఎ.రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో మంత్రి శ్రీధర్‌బాబు 1,143 వినతిపత్రాలను స్వీకరించారు. పూర్తి వివరాలుంటే దరఖాస్తు దారుల సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే వీలుంటుం దన్నారు. ఈనెల 17న రెండు, మూడు పోటీ పరీక్షలున్నందున టిఎస్ జెన్‌కో ఎఇ పరీక్ష వాయిదా వేయాలని పలువురు అభ్యర్థులు విజ్ఞప్తి చేశారని తెలిపారు. ఈ అంశాన్ని సిఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామనీ, సంబంధిత అధికారులతో చర్చించి పరీక్ష వాయిదాపై సానుకూల నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. తమకిచ్చే గౌరవ వేతనాన్ని ప్రతి నెలా రెగ్యులర్‌గా ఇవ్వాలని మధ్యాహ్న భోజన వంట కార్మికులు విజ్ఞాపన పత్రం అందజేశారని చెప్పారు. దీన్ని పరిష్కరిం చేందుకు కృషి చేస్తామని హామీనిచ్చారు. ప్రజాదర్బార్ నిర్వహణను జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ సమన్వయం చేశారు. ఆయుష్ విభాగం డైరెక్టర్ హరిచందన, సీనియర్ ఐఎఎస్ అధికారి ముషారఫ్ అలీ, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిసెట్టి, ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ వెంకటేష్ దోత్రి ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇప్పటిదాకా 4,471 వినతిపత్రాల స్వీకరణ

రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన ప్రజాదర్బార్‌కు మంచి స్పందన లభిస్తున్నది. ప్రజలు తమకు సంబంధించిన వివిధ రకాల సమస్యలపై వినతి పత్రాలను సమర్పించేందుకు ప్రజా భవన్‌కు పెద్ద ఎత్తున వస్తున్నారు. ప్రజాదర్బార్ మొదలైన నాలుగు రోజుల్లోనే 4,471 వినతిపత్రాలు వచ్చాయని అధికార వర్గాలు తెలిపాయి. అందులో ఎక్కువ శాతం డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, పింఛన్లకు సంబంధించిన సమస్యలే ఉన్నాయని పేర్కొన్నాయి.

వైద్యవిధాన పరిషత్‌లో నాలుగు వేల ఖాళీలు

- కొత్త సర్కారులోనైనా భర్తీ అయ్యేనా?
- నామమాత్ర సేవలకే పరిమితమవుతున్న వైనం
- ప్రయివేటుకు వెళ్లక తప్పని పరిస్థితి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అక్కడ ఆస్పత్రి ఉంటుంది. అదీ ప్రభుత్వాస్పత్రి. నర్సు ఉంటే డాక్టరు ఉండరు. డాక్టర్ ఉంటే నర్సు ఉండరు. వారిద్దరు ఉంటే ఫార్మాసిస్టు ఉండరు. ల్యాబ్ టెక్నీషియన్లు కనిపించరు. బయట మాత్రం బోర్డు బ్రహ్మాండంగా కనిపిస్తుంటది. డిస్పెన్సరీలు మొదలు జిల్లా ఆస్పత్రుల వరకు సిబ్బంది కొరత వెక్కిరిస్తుంటది. ప్రభుత్వం నుంచి వచ్చే అధికారిక సమాచారంలో మాత్రం తాము ఎన్ని ఆస్పత్రుల ద్వారా ప్రజలకు ప్రజావైద్యాన్ని అందిస్తున్నామనే విషయాలను వివరిస్తుంటారు. క్షేత్రస్తాయిలోనేమో ఆయా ఆస్పత్రులు అందించాల్సిన సేవలు పూర్తి స్థాయిలో అందించలేక నామమాత్రంగా మిగిలాయి. రాష్ట్ర వైద్య విధాన పరిషత్ పరిధిలో రాష్ట్రంలో 179 ఆస్పత్రులు డిస్పెన్సరీ మొదలు జిల్లా ఆస్పత్రుల వరకున్నాయి. ఇందులో 10,470 బెడ్లున్నాయి. వీటిలో జిల్లా ఆస్పత్రుల్లో 2,490, ఏరియా ఆస్పత్రుల్లో 2,940, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో (50 పడకలవి) 1,100, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు (30 పడకలవి) 2,430, మెటర్నిటీ చైల్డ్ హెల్త్ హాస్పిటల్స్ లో 1,250, అర్బన్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో 260 ఉన్నాయి. వస్తున్న రోగుల సంఖ్యకు తగినట్టుగా ఈ ఆస్పత్రులు పూర్తి స్థాయిలో సేవలందించాలంటే 12,588 మంది సిబ్బంది అవసరం. అయితే కేవలం 5,197 మంది మాత్రమే రెగ్యులర్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. 7,400 పోస్టులు భర్తీ చేయాల్సినవి ఉండగా, ఇందులో అత్యవసర సేవలందించేందుకు 1,014 మంది కాంట్రాక్టు, 1,582 మంది అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన సేవలందించే వారు ఉన్నారు. మరో నాలుగు వేల పోస్టులు ఖాళీగా ఉండటంతో క్షేత్రస్థాయిలో సేవలు ఏ స్థాయిలో అందుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. ఎన్నికలకు ముందు నిర్వహించిన నర్సుల పరీక్షా ఫలితాలు వెల్లడైతే 757 మంది వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో సేవలందించేందుకు అందుబాటులోకి వస్తారు. పరీక్షలు పూర్తయినప్పటికీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో వాటి ఫలితాలను నిలిపేసిన సంగతి తెలిసిందే. వాటిని వేగంగా భర్తీ చేస్తే కొంత మేరకు సిబ్బంది కొరత తగ్గే అవకాశముంది.

తగ్గుతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో రాత్రి పూట ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గుతున్నాయి. చాలా జిల్లాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు 15 డిగ్రీల లోపే నమోదవుతున్నాయి. గడిచిన 24 గంటల్లో కొమ్రం భీం అసిఫా జిల్లాలో 10.3 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత రికార్డయింది. రాష్ట్రం మీదుగా కిందిస్థాయిలో గాలులు వీస్తున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి కె.నాగరత్న తెలిపారు. 24 జిల్లాల్లో 15 డిగ్రీల లోపే రాత్రి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాబోయే మూడ్రోజుల పాటు కూడా చాలా జిల్లాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు 15 డిగ్రీల లోపు నమోదయ్యే అవకాశముంది. ఈ నేపథ్యంలోనే రాత్రిపూట చల్లని గాలులు వీస్తున్నాయి. ఉదయం తొమ్మిది గంటల దాకా చలి వణికిస్తోంది. ఇదిలా ఉండగా, జూన్ ఒకటో తేదీ నుంచి డిసెంబర్ పదో తేదీ వరకు రాష్ట్రంలో కురవాల్సిన దానికంటే తక్కువ వర్షపాతం 23 జిల్లాల్లో నమోదైంది. +20 నుంచి +59 శాతం వరకు నమోదైన జిల్లాలు సిద్దిపేట, నిజామాబాద్, జయశంకర్ భూపాలపల్లి, నిర్మల్, రాజన్నసిరిసిల్ల, మెదక్, జగిత్యాల, వరంగల్ ఉన్నాయి. జోగులాంబ గద్వాల, నాగర్ కర్నూల్ జిల్లాల్లో కురవాల్సిన దానికంటే -20 శాతం నుంచి -59 శాతం వరకు లోటు వర్షపాతం రికార్డయింది. మిగతా జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది.

కాళేశ్వరంపై విచారణ

- సమగ్ర నివేదికకు ఆదేశం
- కృష్ణాజలాల్లో న్యాయమైన వాటా కోసం చర్యలు
- నీటిపారుదల శాఖ సమీక్షలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టుపై విచారణ చేస్తామని రాష్ట్ర భారీ, నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రకటించారు. ఆ పథకానికి సంబంధించిన పూర్తి వివరాలతో సమగ్ర నివేదికను సమర్పించాలని ఉన్నతాధికారు లను ఆదేశించారు. త్వరలోనే మేడిగడ్డను సందర్శిస్తాననీ, అందుకు ఏర్పాట్లు చేయాలని చెప్పారు. సోమవారం హైదరా బాద్‌లోని భారీ నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ రాష్ట్ర కార్యాలయం జలసౌధలో సంబంధిత శాఖపై సమీక్ష చేశారు. పెండింగ్ ప్రాజెక్టులు, కృష్ణా జలాలు, పాలమూరు-రంగారెడ్డికి జాతీయ హోదా, చెరువుల నిర్వహణ తదితర అంశాలపై ఉన్నతాధికారులతో పూర్తి స్థాయిలో దాదాపు గంటన్నరపాటు చర్చించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ...కాళేశ్వ రంలోని మేడిగడ్డ బ్యారేజీ కుంగడం తీవ్రమైన అంశమని వ్యాఖ్యానించారు. నిర్మాణం చేపట్టిన ఏజెన్సీని, అధికారులు తన పర్యటనలో ఉండేలా చూడాలని ఇంజినీర్ ఇన్ చీఫ్ సి.మురళీ ధర్‌ను ఆదేశించారు. వచ్చేవారం నుంచి ప్రతి ప్రాజెక్టుపై విడి విడిగా ప్రత్యేకంగా సమీక్ష నిర్వహిస్తానని అన్నారు. మేడిగడ్డను ఎవరు నిర్మించినా, జరిగిన ఘటనలకు బాధ్యత వహించా ల్సిందేనని తేల్చి చెప్పారు. ప్రాజెక్టు కట్టిన ఏజెన్సీ, అధికారులు జవాబుదారులని స్పష్టం చేశారు. 'రూ.లక్ష కోట్లతో నిర్మించిన ప్రాజెక్టు కింద నామమాత్రం కొత్త ఆయకట్టు ఉంది. ఒక్కో ఎకరా సాగుకు అవుతున్న ఖర్చు వివరాలు చెప్పాలని అధికారు లను అడిగా. ఎస్ఎల్‌బిసి సొరంగం పనుల పురోగతిపై ఆరా తీశాను. సొరంగం పనుల చేస్తున్న సంస్థకు బిల్లులు బకాయి ఉన్నట్టు తెలిసింది. రాష్ట్రంలోని 40 వేల చెరువుల నిర్వహణ కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటా' అని చెప్పారు. కృష్ణాజలాల్లో రాష్ట్రానికి న్యాయమైన వాటా కోసం కృషి చేస్తామని చెప్పారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రాణహిత చేవెళ్ల సైటు మార్చి, పేరు మార్చి, ఖర్చుపెంచినా పాలమూ రు-రంగారెడ్డికి ప్రాధాన్యత ఇవ్వలేదని గుర్తుచేశారు. అలాగే తక్కువ ఖర్చుపెడితే పూర్తయ్యే ప్రాజెక్టులు ఎన్నో ఉన్నాయని, వాటిపై కూడా దృష్టిపెడతామని ప్రకటించా రు. అమూల్యమైన ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూస్తా మని స్పష్టం చేశారు. అనేక రకాల అరోపణ లు ఉన్నాయ నీ, విచారించి నిగ్గుతేలుస్తామని అన్నారు. రహస్యం, గోప్యం ఉండ కూడదనీ, అవినీతి జరగ కూడదన్నా రు. అందుకే రాతపూర్వక నివేదిక అడిగినట్టు పేర్కొన్నారు. ప్రతిప్రాజెక్టు కొత్త ఆయకట్టు లెక్కలు చెప్పాల్సిందే నని అన్నారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టో ఆధారంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. పోలింగ్ రోజు నాగార్జునసాగర్ డ్యాంపై జరిగిన తంతు అనుమానా స్పదంగా ఉందన్నారు. కాళేశ్వరంపై విచారణ ఉన్నతాధికారు లతో చేయిస్తారా ? లేక సిబిఐతోనా అని విలేకర్లు అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ 'ఇంకా అంతవరకు ఆలోచించలేదనీ, క్యాబినెట్, సిఎంతో చర్చించిన అనంతరం నిర్ణయం తీసుకుంటా మని' చెప్పారు.

వాడివేడిగా సమీక్ష

కాళేశ్వరంప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ బ్యారేజీ కుంగడం పై మంత్రికి అధికారులు వివరణ ఇచ్చారు. 'మేడిగడ్డ బ్యారేజీ నిర్మానానికి రూ.4600 కోట్లు ఖర్చు చేశాం.. అందులోని ఒకపిల్లర్ 1.2 మీటర్లు కుంగడంతో, మరో మూడు పిల్లర్లపై ఆ ప్రభావం పడింది.ముందురోజు సాయంత్రం పిల్లర్ కుంగిన వెంటనే ప్రాజెక్టులో నీటిని తోడేశాం..నీటిని తోడిన తర్వాత పిల్లర్ కుంగడం తగ్గింది" అని అధికారులు మంత్రికి వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. ఇంజినీర్ ఇన్ చీఫ్ సి.మురళీధర్ ప్రాజె క్టులపై సమగ్రంగా పవర్‌పాయింట్ ప్రజేంటేషన్ ఇచ్చారు. దీనికి స్పందించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇది తీవ్రమైన అంశమనీ, ప్రాజెక్టు సందర్శనకు ఏర్పాట్లు చేయాలని అధికారు లను ఆదేశించారు. 'అక్కడ ఖర్చు చేసిందెంత ? ఎంత ఆయక ట్టుకు నీరిచ్చేందుకు నిర్మాణం జరిగింది ? ఒక్కో ఎకరా సాగుకు అవుతున్న వ్యయమెంత? అని అధికారులను మంత్రి ప్రశ్నించా రు. ఈసమీక్షలో మురళీధర్‌తోపాటు జనరల్ ఇఎన్‌సి బి. అనిల్‌కుమార్, కాళేశ్వరం సిఇ వెంకటే శ్వర్లు, సాగు నీటిశాఖ సలహాదారు పెంటారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆ సమాచారమివ్వండి

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుపై పూర్తి సమాచారం సిద్ధం చేయాలని అధికారులను మంత్రి ఆదేశించా రు. దీనిపై ప్రత్యేకంగా సమీక్ష చేద్దామన్నారు. సిడబ్ల్యుసి అనుమతి లేకుండా ప్రాజెక్టులు ఏలా నిర్మిస్తారు ? నిధులు ఎలా సమీకరించారు ? అని ప్రశ్నించారు. నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టు లకు థర్డ్‌పార్టీ చెకింగ్ లేదా ? కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి సిడబ్ల్యుసి అనుమతి ఉందా? పాత ఆయకట్టును కూడా ఎందుకు కొత్త ఆయకట్టులో కలుపుతున్నారు ? వర్షం వచ్చినప్పుడు నీటిని లిఫ్ట్‌చేయాల్సిన అవసరం లేదు కదా ? నీటిపారుదల శాఖ పారదర్శకంగా, అవినీతికి తావు లేకుండా సమర్థంగా పనిచేయాలి. ఇదివరకు నీటిపారుదల శాఖలో ఏదో జరిగిందని అనుమానాలు ఉన్నాయి, వందేండ్లు ఉండాల్సిన ప్రాజెక్టులు మూడేండ్లకే దెబ్బతినడం ఆందోళనకరం. ఎందుకు అలా జరిగింది ? మంత్రి అధికారులను అడిగారు. దీంతో ఇఎన్సీలు, సిఇలు, ఎస్ఇలు తెల్లమొహాలేసినట్టు తెలిసింది. ఒక్క ఇఎన్‌సి మురళీధర్ మినహా మరెవరూ జవాబు చెప్పే సాహసం చేయలేకపోయినట్టు సమాచారం. దీంతో ప్రాజెకుల్ల వారీగా పూర్తివివరాలతో సమీక్షకు వస్తామని అధికారులు చెప్పారు.

చెప్పినా రాని స్మితా సభర్వాల్

మాజీ సిఎం కార్యదర్శి, సాగునీటిశాఖ ఇన్‌చార్జ్ కార్యదర్శిగా నియమితులైన స్మితాసభర్వాల్ సమీక్షకు హాజరుకాలేదు. గైర్హాజరుకు ఎలాంటి కారణాలు తెలియజేయలేదు. దీంతో చేసేది లేక ఇంజినీర్ ఇన్‌చీఫ్ సి.మురళీధర్ జలసౌధ సమీక్ష సమావేశానికి మంత్రి ఉత్తమ్‌ను ఆహ్వానించారు. ఆయన వచ్చే సమయానికి ఇఎన్‌సిలు, సిఇలు, ఇతర అధికారులు, ఉద్యోగ సంఘాల నేతలు ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి స్వాగతం పలికారు

మహారాజశ్రీ 4వ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారికోర్టు, రాజమహేంద్రవరం
I.A. No. 734/2023
O.S. No. 752/2021
Between:
Marukurthi Krishna
Murukurthi Madhu ...*Plaintiffs*
AND
M/s. Deepak Electricals Stores, rep. by its Proprietor, Papatlal jain and Others ...*Defendants*
D-2: Murukurthi Venkata Somanadh, S/o. late Laksmi Kantha Rao, Hindu, aged 55 years, R/o. D.No. 8-24-39, Khambam vari Satram street, Main Road, Rajamahendravaram. Presently residing at Sy. No. 843, 859, 860, Chowdary Guda, Opp. to PJS colony, Narapally, Gutkesari Mandal, Telangana State - 500088. ...*2nd Defendant*
పై నెంబరు దావాలో 2వ ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 21-12-2023 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
రాజమండ్రి **పి.ప్రసాదరావు**
8-12-2023 అడ్వకేట్, రాజమండ్రి

వారంరోజులైన కాకముందే ఆరోపణలా?

- నిర్వాసితుల సమస్యలను పరిష్కరిస్తాం
- గజ్వేల్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"ప్రభుత్వం ఏర్పాటై వారం రోజులైనా గడవకముందే మాజీ మంత్రులు నోరు పారేసుకుంటున్నారు.. నోరు అదుపులో పెట్టుకుంటే మంచిది.. కొత్త ప్రభుత్వానికి సూచనలు, సలహాలు ఇవ్వడం మానుకుని విమర్శలు చేయడం సిగ్గుచేటు.." అని రవాణా శాఖ, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అనంతరం మొదటిసారిగా గజ్వేల్‌కు రావడంతో.. పట్టణంలో మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఇంట్లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో పొన్నం మాట్లాడుతూ 'రైతుబంధు ఏది, రైతుబీమా ఏది, రైతుకు బోనస్ ఏది' అంటూ కొందరు మాజీ మంత్రులు మాట్లాడుతున్నారని.. నూతన ప్రభుత్వం ఏర్పడి వారం రోజులైనా కాలేదని అప్పుడే నోరు పారేసుకుంటే ఎలా అన్నారు. మీరు ఏ రోజైనా ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటి లేదా రెండో తారీఖీల్లో జీతాలు వేశారా అని ప్రశ్నించారు. కొందరు ప్రొఫెసర్లు సైతం ప్రభుత్వం ఆరు నెలలే ఉంటుందని.. అటు పిమ్మట ప్రభుత్వం కూలిపోతుందనడం తగదన్నారు. ప్రజలు తీర్పు ఇచ్చారని, దానికి అనుగుణంగా అభివృద్ధి చేస్తామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం సమర్థవంతంగా నడుస్తుందని చెప్పారు. ప్రజలు తగిన బుద్ధి చెప్పినా.. మాజీ మంత్రులకు ఆశలు చల్లారలేదన్నారు. ప్రమాణ స్వీకారం చేసిన రెండ్రోజుల్లోనే ఆరు గ్యారంటీల్లో రెండు అమలు చేశామని.. ఇది మాజీ మంత్రులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సిఎంగా ఉన్నప్పుడు ప్రవేశపెట్టారని.. నేడు మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆ పథకాన్ని రూ.పది లక్షలకు పెంచినట్టు గుర్తు చేశారు. మరో నాలుగు గ్యారెంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామన్నారు. సిద్దిపేట జిల్లాలోని మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్, గండేల్లి, గౌరవెల్లి తదితర ప్రాజెక్టుల కింద నిర్వాసితులకు 2013 చట్టం ప్రకారం రావాల్సిన పూర్తి బెనిఫిట్స్ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఇరిగేషన్ మంత్రితో చర్చిస్తామన్నారు. వారికి న్యాయం చేస్తామన్నారు. గజ్వేల్ అభివృద్ధి విషయంలో తాను ప్రత్యేక శ్రద్ధ వహిస్తానన్నారు. స్థానికంగా మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ప్రజలకు అందుబాటులో ఉంటారని చెప్పారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నాం ప్రభాకర్ గౌడ్

ముఖ్యమంత్రిగా ప్రజలకు అందుబాటులోని ఉండని కెసిఆర్.. ప్రతిపక్ష నాయకుడిగానైనా అందుబాటులో ఉండాలని కోరారు. పేదల ఇళ్ల నిర్మాణానికి రూ. ఐదు లక్షల సాయం చేస్తామన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో గత ప్రభుత్వంలో ఐదువేల ఇళ్లు నిర్మించి.. ఇప్పటివరకు ఒక్క ఇళ్లైనా పేదలకు ఇవ్వలేదన్నారు. ఈ సమావేశంలో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి, కాంగ్రెస్ దుబ్బాక ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి, సిద్దిపేట ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, నాయకులు నాయిని యాదగిరి, మల్లారెడ్డి, సర్దార్ ఖాన్, రంగారెడ్డి, ముత్యాలు, రవీందర్ రెడ్డి, మోహన్, నక్క రాములు, నాయినితిరుపతి, ఇక్బాల్, వహీద్ ఖాన్, సురేష్, మామిడి కృష్ణ, రమేష్ గౌడ్, నాగరాజు గౌడ్, సిపిఐ నాయకులు మంద పవన్ తదితరులు ఉన్నారు.

చింతపల్లి ఎస్ఐ సతీష్ రెడ్డి సస్పెన్షన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నల్లగొండ జిల్లా చింతపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగిన లాకప్‌డెత్ ఘటనలో ఎస్ఐని సస్పెండ్ చేస్తూ ఎస్పి అపూర్వరావు ఉత్తర్వులు జారీ చేశారు. భూ వివాదంలో తలదూర్చి అతి ఉత్సాహం చూపించిన ఎస్ఐ సతీష్‌రెడ్డిని ఐజి ఆదేశాల మేరకు సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేసినట్టు ఎస్పి అపూర్వరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భూ వివాదాలు, సివిల్ విషయాల్లో పోలీసులు జోక్యం చేసుకోవద్దని, ఎవరైనా ఈలాంటి కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు.

వాహిని పలు కళా ప్రక్రియలకు వేదిక

ప్రజాశక్తి - కల్చరల్

వాహిని సంస్థ పిల్లలకి యువతకు భిన్న కళా ప్రక్రియలలో శిక్షణ ఇస్తూ జాతి సంస్కృతిని పరిరక్షణలో భాగస్వామ్యులు ఇనారని వివిధ రంగ ప్రముఖులు ప్రశంసించారు. శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ద్వితీయ వార్షికోత్సవం నృత్య వాయిద్య సంగీత భరితంగా జరిగింది. బాలలు పాడిన శ్లోకాలు, పిల్లలు చేసిన శాస్త్రీయ నృత్యాలు యువత వీణా వాదనంతో ప్రేక్షకులు పరవశించారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్న విద్యా వేత్త డాక్టర్ శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ జాతి మనుగడకు సంస్కృతి ఆధారమని కళలే సంస్కృతికి చిరునామా అన్నారు. తల్లి తండ్రులు పిల్లల ప్రథమ గురువులనీ వారికి సంస్కృతిని నేర్పితే సమాజంలో పలు రుగ్మతలు నివారించవచ్చని అయన అన్నారు వాహిని నిర్వహణలో లక్ష్మీప్రియ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. జర్నలిస్ట్ స్వప్న మాట్లాడుతూ కళలు ఆత్మ విశ్వాసం మానసిక స్థైర్యం ఇస్తాయని అన్నారు. నిద్ర ఆహారంతో పాటు కళల అభ్యాసం నిత్య జీవితంలో భాగం కావాలని అప్పుడు ఎలాంటి ఒత్తిడినైన తట్టుకొనే శక్తి వస్తుందని వివరించారు. వాహిని సంస్థ చిన్నారులకు సైతం కళలో శిక్షణ ఇవ్వటం అభినందనీయమని ఇందుకు సహకరిస్తున్న గురువులను ప్రశంసలు అన్నారు. ప్రముఖ వాయులీన నిపుణులు అచుత కుమారి గాన సభ అధ్యక్షులు కళా జనార్ధన మూర్తి దీపారాధన చేసి కార్యక్రమాన్ని ఆరంభించగా సంస్థ స్థాపకురాలు శంకరమంచి లక్ష్మీ ప్రియ స్వాగతం పలికారు.

ఆరు గ్యారంటీలను అమలు చేస్తాం

- మాజీ ఎంపి రేణుకా చౌదరి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉచిత బస్సు సౌకర్యంతో మహిళలకు ఆర్థికంగా ఎంతో మేలు జరుగుతుందని మాజీ ఎంపి కాంగ్రెస్ నేత రేణుకా చౌదరి అన్నారు. సోమవారం గాంధీభవన్ నుంచి మహిళలతో కలిసి లక్‌డీకపూల్ వరకు ఆమె బస్సులో ప్రయాణించారు. ఈ సందర్భంగా ఉచిత బస్సు పథకాన్ని మహిళలకు వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ హైదరాబాద్ లాంటి మహానగరంలో చిన్నా చితక ఉద్యోగులు, వ్యాపారులకు ఈ పథకం వరమని అన్నారు. ఆరు గ్యారెంటీలతో పాటు కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో పెట్టిన అన్ని హామీలను అమలు చేస్తుందని తెలిపారు. బిఆర్ఎస్ నేతలు ఇక రెస్ట్ తీసుకోవాలని సూచించారు. గత ప్రభుత్వం తొమ్మిదిన్నరేండ్ల కాలంలో చేసిన తప్పులను పునరావృతం కాకుండా మంచి పాలనను అందిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వం వచ్చి రెండు రోజులు కాకముందే కొంతమంది విమర్శలు మొదలు పెట్టడం సబబు కాదని హితవు పలికారు.



అధిష్టానం ఆదేశిస్తే ఎంపిగా పోటీ చేస్తా

- మాజీ మంత్రి జానారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆదేశిస్తే ఎంపిగా పోటీ చేసేందుకు సిద్ధమని మాజీ మంత్రి జానారెడ్డి తెలిపారు. సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయనను హైదరాబాద్‌లోని నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో తాజా రాజకీయ పరిస్థితులపై దాదాపు గంటకు పైగా ఇద్దరు చర్చించారు. ఈ సందర్భంగా సిఎంను జానారెడ్డి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జానారెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఇబ్బందులను, బాధలను తెలియజేయడం శుభపరిణామమన్నారు. ముఖ్యమంత్రిగా తెలంగాణ ప్రజల ప్రజాభిమానం చూరగొనేలా పనిచేయాలని సిఎంకు చెప్పానన్నారు. ప్రభుత్వంలో తన పాత్ర ఏమి ఉండదని, సలహాలు, సూచనలు ఇస్తానని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ఆస్పత్రిలో ఉండడం బాధాకరమన్నారు. తాను వెళ్లి పరామర్శించే ప్రయత్నం చేశానని, వీలు కాకపోవడంతో కేటీఆర్, హరీష్‌లను కలిశానని చెప్పారు. కెసిఆర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. నాగార్జున సాగర్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన తన కుమారుడు జయవీర్‌కు మంత్రి పదవి ఇవ్వాలని సిఎంను అడుగలేదని ఈ సందర్భంగా జానారెడ్డి తెలిపారు.

ప్రారంభించారు.. వదిలేశారు..!

- యుద్ధప్రాతిపదికన ప్రారంభమైన కులసంఘాల భవనాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆయా కులాల ప్రాతిపదికన యుద్ధప్రాతిపదిన నిర్మించిన భవనాలు వృథాగా ఉన్నాయి. వాటిని ఆగమేఘాల మీద వర్చువల్ పద్ధతిలో అప్పటి మంత్రి కెటిఆర్ ప్రారంభించారు. కానీ వాటి నిర్వహణ వదిలేశారు. మిర్యాలగూడ పట్టణం ఎన్నెస్పీ క్యాంపు అవరణలో బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సుమారు రూ.4.50 కోట్లతో ఎస్‌సి సామాజిక తరగతికి భారతరత్న బిఆర్.అంబేద్కర్ భవనం, ఎస్‌టి సామాజిక సామాజిక తరగతికి సంత్ సేవాలాల్ భవనం, వెనుకబడిన తరగతుల సామాజిక తరగతికి మహాత్మా జ్యోతిరావుపూలే భవనాన్ని నిర్మించారు. నల్లగొండ పర్యటనకు వచ్చిన అప్పటి ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి కెటిఆర్ ఈ మూడు భవనాలను అక్టోబర్ 8న వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు. 9న మిర్యాలగూడ వచ్చి ప్రత్యక్షంగా ప్రారంభిస్తారని బిఆర్ఎస్ నేతలంతా అనుకున్నారు. అదే రోజు ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడం, ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో కెటిఆర్ పర్యటన ఆగిపోయింది. వర్చువల్‌లో ప్రారంభించారు. కానీ, రెండు నెలలుగా నిరుపయోగంగా ఉన్నాయి. నూతన ప్రభుత్వం ఆయా భవనాలను శాఖాపరంగా నిర్వహిస్తుందా.. ఎలా చేస్తుందనేది స్పష్టత రావాల్సి ఉంది. ఆ భవనాల్లో ఆయా శాఖలకు చెందిన ఏఎస్ డబ్ల్యుఒ, ఎటిడబ్లుఒ, బిసిడబ్లుఒ కార్యాలయాలు ఏర్పాటు చేసి ఆయా సామాజిక తరగతులకు సంబంధించిన సభలు, సమావేశాలు నిర్వహించేందుకు అనుమతి ఇచ్చేలా అధికారులకు అధికారాలు ఇవ్వాలని నాయకులు కోరుతున్నారు.

టాటానగర్ ప్లాస్టిక్ గోదాంలో భారీ అగ్ని ప్రమాదం

- మైలార్‌దేవ్‌పల్లి పోలీసుస్టేషన్ పరిధిలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నివాసాల మధ్యలో ఉన్న ప్లాస్టిక్ గోదాంలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో టాటానగర్‌లోని ఒక ప్లాస్టిక్ గోదాంలో మంటలు వ్యాపించాయి. స్థానికులు వెంటనే పోలీసులకు, ఫైర్స్ సిబ్బందికి సమాచారం అందించారు. గోదాంలో ప్లాస్టిక్ నిలువలు పెద్దఎత్తున ఉండటంతో క్షణాల్లో భారీగా మంటలు వ్యాపించి ఆ ప్రాంతం మొత్తం దట్టమైన పొగ వ్యాపించింది. ఫైర్ సిబ్బంది సుమారు నాలుగు గంటలపాటు కష్టపడి మంటలను అదుపులోకి తెచ్చారు. మంటలు వ్యాపించిన సమయంలో గోదాంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. ఈ ఘటనలో గోదాంలో ఉన్న రెండు ఆటోలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులూ లేకుండా నివాసాల మధ్యలో ప్లాస్టిక్ గోదాము ఏర్పాటు చేశారని, యాజమాన్యం మీద కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనలో సుమారు రూ.పది లక్షల ఆస్తి నష్టం సంభవించి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు.

బస్సు సౌకర్యం కల్పించండి

- ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని వివిధ గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించడంతోపాటు ట్రిప్పులను పెంచాలని బిఆర్ఎస్ బోథ్ నియోజకవర్గ మహిళా అధ్యక్షులు కాటేపల్లి సునీత రెడ్డి ఎమ్మెల్యేను కోరారు. సోమవారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను కలిసి వినతిపత్రం అందించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణం కొనసాగిస్తున్నందున రోడ్డు సౌకర్యం ఉన్న గ్రామాలకు బస్సులు నడిపిస్తే వారికి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. బోథ్ నుంచి భారీ మెజారిటీతో గెలిచిన ఎమ్మెల్యేను ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

అద్దె కట్టలేదని ఇఎస్ఐ ఆస్పత్రికి తాళం

- బయటే విధులు నిర్వహిస్తున్న డాక్టర్
- 8 నెలలుగా వేతనాలు లేవని అవుట్‌సోర్సింగ్ సిబ్బంది ఆవేదన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో


బయటే విధులు నిర్వహిస్తున్న డాక్టర్

ఇఎస్ఐ డిస్పెన్సరీ భవనానికి అద్దె ఇవ్వడం లేదంటూ యజమాని తాళం వేశారు. అయినా అధికారుల నుంచి స్పందన లేకపోవడంతో నాలుగు రోజులుగా డాక్టర్ బయటే విధులు నిర్వహిస్తున్నారు. చీటీ రాసివ్వడం తప్ప మందులు ఇవ్వలేకపోతున్నారు. దాంతోపాటు తమకు ఎనిమిది నెలలుగా వేతనాలు రావడం లేదని అవుట్‌సోర్సింగ్ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి..

మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని పోతురాజుపల్లిలో ఉన్న ఇఎస్ఐ డిస్పెన్సరీ భవనానికి 19 నెలలుగా యజమానికి అద్దె ఇవ్వడం లేదు. దాంతో యజమాని డిస్పెన్సరీకి తాళం వేశారు. అధికారుల నుంచి స్పందన లేకపోవడంతో డాక్టర్ భరత్ నాలుగు రోజులుగా సిబ్బందితో కలిసి బయటే కూర్చొని రోగులకు వైద్యసేవలు అందిస్తున్నారు. మందుల చీటీని రాసి ఇవ్వడం తప్ప మందులు ఇవ్వలేకపోతున్నారు. దాంతో మందులు బయట కొనుక్కోవడానికి కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. యజమానికి ఇచ్చే అద్దె గురించి పైఅధికారులకు నివేదికలు పంపామని, అక్కడి నుంచి సమాధానం రాలేదని డాక్టర్ భరత్ తెలిపారు. కాగా పోతురాజుపల్లిలో మినహా ఎక్కడా ఈఎస్ఐ డిస్పెన్సరీలు అందుబాటులో లేకపోవడంతో కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డిస్పెన్సరీని తెరిచే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. అలాగే డిస్పెన్సరీలో అవుట్‌సోర్సింగ్ విధానంలో ఉద్యోగాలు చేస్తున్న ఏడుగురు తమకు ఎనిమిది నెలలుగా వేతనాలు సైతం రావడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

కాంగ్రెస్‌కు అధికారం శాశ్వతం కాదు

- బోయినపల్లి వినోద్ కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్‌కు అధికారం శాశ్వతం కాదని మాజీ ఎంపి బి.వినోద్ కుమార్ తెలిపారు. సిఎం రేవంత్‌రెడ్డి తమ కార్యకర్తలను అదుపులో పెట్టుకోవాలని ఆయన సూచిచారు. సోమవారం తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్యేలు వినయ్ భాస్కర్, గువ్వల బాలరాజుతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. అధికార పక్షం మారినంత మాత్రాన శిలాఫలకాలు తొలగించడం సబబు కాదని హితవు పలికారు. రానున్న రోజుల్లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తామన్నారు. శిలాఫలకాలు ధ్వంసం చేసిన వారిపై కేసులు నమోదు చేయాలని, వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని కెసిఆర్ ప్రభుత్వం నిర్మించిన ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులు ప్రజల ఆస్తి అని గుర్తుచేశారు. ప్రభుత్వం మంచి చేస్తే అభినందిస్తామనీ, చెడు చేస్తే నిలదీస్తామని స్పష్టం చేశారు. ఇందిరాగాంధీ సమయంలో ఎమర్జెన్సీ సమయంలో కాంగ్రెసుకు ప్రజలిచ్చిన తీర్పును మర్చిపోవద్దని సూచించారు.

దంపతుల ఆత్మహత్యాయత్నం

- భూమిని అధికారులు లాక్కుంటున్నారని ఆవేదన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గతంలో ప్రభుత్వం ఇచ్చిన భూమిని తిరిగి అధికారులు లాక్కుంటున్నారని వారి ముందే భార్యాభర్తలిద్దరూ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా కొనరావుపేట మండలం కొండాపూర్ గ్రామంలో జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కొనరావుపేట మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన మల్యాల నందం 15 సంవత్సరాలు జనశక్తి పార్టీలో పనిచేసి తెలంగాణ రాకముందు అప్పటి ప్రభుత్వం ముందు లొంగిపోయాడు. 2013లో ప్రభుత్వం నందంకు కొండాపూర్ శివారులోని 116ఎ సర్వే నెంబర్‌లో ఎకరం 20 గుంటల భూమి ఇచ్చింది. అప్పటి నుంచి ఆ భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల సర్వేయర్ కుమార్ వారికి ఇక్కడ భూమి లేదని.. రూ.50 వేలు లంచం ఇస్తే సర్వే చేసి భూమి ఇస్తానని చెప్పాడు. లంచం ఇవ్వకపోవడంతో ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. ఈ విషయపై కలెక్టర్‌కూ ఫిర్యాదు చేశారు. అయినా అధికారులు స్పందించడం లేదు. భూమిని స్వాధీనం తహసీల్దార్ విజయరామారావు, అధికారులు సోమవారం వచ్చారు. భూమిని స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేయగా మల్యాల నందం, ఆయన భార్య పద్మ అధికారుల ముందే పురుగుల మందు తాగేందుకు యత్నించారు. నందం పురుగుల మందు తాగి కింద పడిపోయాడు. వెంటనే గమనించిన తహసీల్దార్ తన వాహనంలోనే భార్యాభర్తలు ఇద్దరినీ సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయంపై తహసీల్దార్ స్పందిస్తూ.. రెవెన్యూ భూమిని ప్రభుత్వం అటవీశాఖకు అప్పగించిందని, హద్దులు చూపించేందుకు రాగా ఈ ఘటన జరిగిందని చెప్పారు. ఉన్నతాధికారులకు నివేదించి చర్యలు తీసుకుంటామన్నారు.

వండర్‌లా 'ఉమెన్' ప్రత్యేక ఆఫర్

హైదరాబాద్ : ప్రముఖ అమ్యూజ్‌మెంట్ పార్క్ చైన్, వండర్‌లా హాలిడేస్ తమ హైదరాబాద్ పార్క్ తాజాగా "వండర్ ఉమెన్" అనే ప్రత్యేకమైన ఆఫర్‌ను ఆవిష్కరించినట్లు వెల్లడించింది. డిసెంబర్ ఆరు నుండి ఈ ఆఫర్ అందుబాటులోకి వచ్చిందని ఆ సంస్థ పేర్కొంది. ప్రతి బుధవారం అందుబాటులో ఉండే ఈ ఆఫర్‌లో మహిళలు ప్రత్యేకమైన రెండు టికెట్లు కొనడం ద్వారా మరో ఇద్దరికీ ఉచిత ప్రవేశాలు పొందవచ్చని పేర్కొంది. ఈ ఆఫర్ ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా పొందవచ్చని వండర్‌లా హాలిడేస్ ఎండి అరుణ్ కె. చిట్టిలపిల్లి పేర్కొన్నారు.

మానసిక ఆరోగ్య సేవలు విస్తరించాలి

- తెలంగాణ డైరెక్టర్ డాక్టర్ రమేష్ రెడ్డి

హైదరాబాద్ : మారుమూల ప్రాంతాల్లోనూ మానసిక ఆరోగ్య సేవలు అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉందని తెలంగాణ డిఎంఇ డైరెక్టర్ డాక్టర్ రమేష్ రెడ్డి తెలిపారు. ఇండియన్ సైకియాట్రిక్ సొసైటి (ఐపిఎస్) - తెలంగాణ స్టేట్ బ్రాంచ్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైకియాట్రీ, అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, రీసెర్చ్ ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్‌లోని అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో 'మానసిక సేవలను స్థాపించడం' అనే థీమ్‌తో 9వ మిడ్ టర్మ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌ను రమేష్ రెడ్డి ప్రారంభించి మాట్లాడుతూ ఈ రంగంలో అర్హత కలిగిన నిపుణుల లభ్యత చాలా ముఖ్యమైన పరిమితుల్లో ఒకటన్నారు. మానసిక వైద్యం వైద్య కళాశాలలకే పరిమితమైందన్నారు. అక్కడ కూడా పూర్తి స్థాయిలో లేదన్నారు.

రాజన్న ఆలయంలో నకి'లీలలు'

- నకిలీ ధ్రువపత్రాలతో ఆలయ ఎఇఒ హరికిషన్ ఉద్యోగ పదోన్నతి?
- ప్రవేశం తీసుకుంది సేలంలో.. పట్టా పొందింది బీహార్‌లో..
- ఆలయ రిటైర్డ్ ఉద్యోగి నామాల రాజేందర్ ఫిర్యాదుతో అలస్యంగా వెలుగులోకి
- ఇదే వరసలో మరికొందరూ...?

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దక్షిణాకాశీగా పేరుగాంచిన వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో నకిలీ ధృవపత్రాల భాగోతం కలకలం సృష్టించేట్టు తెలుస్తోంది. ఇప్పటికవరకు కేవలం భక్తులు ఎదుర్కొంటున్న సమస్యలు, లడ్డు తయారీలో నాణ్యతా లోపం, శానిటేషన్ విభాగం నిర్లక్ష్యం, బ్లాక్‌లో టికెట్ల విక్రయం, సిబ్బంది చేతివాటం వంటి పలు విషయాల్లో వార్తల్లోకెక్కిన రాజన్న ఆలయం.. ఇప్పుడు ఏకంగా నకిలీ ధృవపత్రాలతో పదోన్నతి పొందిన ఉద్యోగుల వ్యవహార శైలితో మరోమారు సంచలనం సృష్టించనుంది. రాజన్న ఆలయంలో ఎఇఓగా విధులు నిర్వహిస్తున్న ఎస్ హరికిషన్ నకిలీ ధ్రువపత్రాలు సమర్పించి పదోన్నతి పొందినట్టు సమాచారం. దీనికి తోడు ఆలయాధికారులు సైతం సీనియర్లను కాదని, హరికిషన్‌కు పదోన్నతి కల్పించి, కీలక బాధ్యతలు అప్పగించినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. దీనిపై గతంలోనే కొంతమంది ఉద్యోగులు దేవాదాయ శాఖ కమిషనర్‌కు, ఇతర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా సదరు ఉద్యోగిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదనే వాదనలు వినిపించాయి.

ప్రవేశం తీసుకుంది సేలంలో.. పట్టా పొందింది బీహార్‌లో..

హరికిషన్ నకిలీ ధ్రువపత్రాల విషయంలో ఆయన చేసిన తప్పును ఆయనే బయటకు తీసుకొచ్చేలా చేసుకున్నాడనే విషయం తెలుస్తోంది. ఆలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న క్రమంలో ఇంటర్మీడియట్ అర్హత కలిగిఉన్న హరికిషన్ పదోన్నతి పొందే సమయానికి డిగ్రీ పట్టాను సంపాదించాడు. అది కూడా రెండు తెలుగు రాష్ట్రాల్లోని ఏ ఒక్క యూనివర్సిటీల్లో కాకుండా తమిళనాడులోని సేలం, బీహార్‌లోని మరో యూనివర్సిటీలో డిగ్రీ చదివినట్టు పట్టాలు సమర్పించాడు. ఇందులో కనీసం ఆయన పూర్తి పేరు, తండ్రిపేరు, పుట్టిన తేదీ వంటి ప్రాథమిక వివరాలు కూడా సరిగ్గా లేకపోవడంతో అనుమానం వచ్చిన అధికారులు సదరు విద్యార్థికి సంబంధించిన అకాడమీ వివరాలు తెలపాలని కోరుతూ యూనివర్శిటీలకు లేఖలు రాశారు. వాటిపై ఇంతవరకు ఎలాంటి జవాబు రాలేదు. దీంతో హరికిషన్ సర్టిఫికేట్ల విషయంలో అనుమానాలు రెట్టింపయ్యాయి.

రిటైర్డ్ ఉద్యోగి ఫిర్యాదుతో వెలుగులోకి...

కొన్నేళ్లుగా నకిలీ ధ్రువపత్రాలపై ఆలయంలో తీవ్ర చర్చ జరుగుతున్నప్పటికీ సరైన ఆధారాలు లేకపోవడంతో ఎవరూ దీనిపై దృష్టిసారించలేదు. అయితే ఆలయంలో సూపరిండెంటెండ్‌గా విధులు నిర్వర్తించి పదవీ విరమణ పొందిన నామాల రాజేందర్ ఈ నకిలీ తంతు విషయమై హరికిషన్‌పై పలు మార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. ఎలాంటి స్పందన లేకపోవడంతో చివరికి నవంబర్ నెలలో హరికిషన్ నకిలీ ధ్రువపత్రాల విషయంలో అన్ని ఆధారాలతో ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. దీంతో అసలు విషయం వెలుగులోకి వచ్చినట్టయింది.

ఇదే వరసలో మరికొందరు..?

మరోవైపు ఈ విషయంలో కేవలం హరికిషనే కాకుండా ఇదే వరసలో మరికొంత మంది ఉద్యోగులు ఉన్నట్టు తెలుస్తోంది. హరికిషన్ మాదిరే మరికొంత మంది ఉద్యోగులు నకిలీ ధ్రువపత్రాలు సమర్పించి, అక్రమ మార్గంలో పదోన్నతులు పొందినట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. రాజన్న ఆలయంలో ఇలాంటి నకిలీలు ఉంటూ, అందులోనూ కీలక బాధ్యతలు నిర్వర్తిస్తూ అటు అధికారులను, ఇటు కింది స్థాయి ఉద్యోగులను, సిబ్బందిని ఇబ్బందులకు గురిచేస్తూ కాలం వెల్లదీస్తున్న నకిలీలపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ఉన్నతాధికారులు స్పందించి నకిలీలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆలయ ఉద్యోగులు, సిబ్బందితో పాటు భక్తులు కోరుతున్నారు.

ప్రశ్నిస్తే తొలగింపులే

- జివికె ఇఎంఆర్ఐలో శ్రమదోపిడీ
- సిఎస్‌కు 108 అంబులెన్స్ ఉద్యోగుల జెఎసి వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జివికె ఇఎంఆర్ఐ యాజమాన్యం శ్రమ దోపిడీకి పాల్పడుతున్నదని తెలంగాణ రాష్ట్ర 108 అంబులెన్స్ ఉద్యోగుల జెఎసి ఆరోపించింది. ప్రశ్నించిన వారిని తొలగిస్తున్న యాజమాన్యానికి ప్రభుత్వ అధికారులే సహకరిస్తున్నారని తెలిపింది. ఈ మేరకు సోమవారం జెఎసి నాయకులు గద్దగూటి నగేష్, కెసిరెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి వినతిపత్రం అందజేశారు. సీనియర్ ఈఎంటీలకు రూ.30 వేలు, కొత్త వారికి రూ.14 వేలు, సీనియర్ పైలెట్లకు రూ.28 వేలు, కొత్త వారికి రూ.12 వేలు చెల్లిస్తుండటంతో సీనియర్లను తొలగించి కొత్త వారిని తీసుకునేందుకు యాజమాన్యం ఆసక్తి చూపిస్తున్నదని తెలిపారు. ఇలాంటి యాజమాన్యానికి ప్రభుత్వ అధికారులు సహకరిస్తున్నారని ఫిర్యాదు చేశారు. తమకు సిఎం అపాయింట్‌మెంట్ ఇప్పించాలని కోరారు. వంద శాతం ప్రభుత్వ నిధులతో నడుస్తున్న సేవలను కలెక్టర్ లేదా జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి పరిధిలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. 18 ఏండ్లుగా వంద శాతం ప్రభుత్వ నిధులతో ఒక కార్పొరేట్ సంస్థ 108 అంబులెన్స్ సర్వీస్‌ను నడిపిస్తున్నదని గుర్తుచేశారు. ముందస్తు సమాచారమిచ్చి ఎనిమిది గంటలు మాత్రమే డ్యూటీ చేసిన ఉద్యోగులను 2018లో తొలగించారనీ, వారికి ఐదేండ్ల జీతం చెల్లించి, వారి లొకేషన్లలో విధులు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని కోరారు.